కేటీఆర్ నాయకత్వంలో పనిచేస్తా!

మొదటిపేజీ తరువాయి...

కలిగిన కార్యకర్తగా కేటీఆర్‌కు సంపూర్ణంగా సహకరిస్తానని, ఆయన నాయకత్వంలో పనిచేస్తానని పేర్కొన్నారు. వడ్ల కొనుగోలులో సమస్యలపై హరీశ్ రావు మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్‌మీడియాలో జరుగుతున్న ప్రచారంపై విలేఖరులు అడిగిన ప్రశ్నలకు ఆయన జవాబిచ్చారు. ''నా లీడర్ కేసీఆర్. ఆయన ఏం చెప్పినా, నేను తు.చ. తప్పకుండా పాటిస్తాను. అంతేతప్ప గీత దాటే సమస్యే లేదు'' అని హరీశ్‌రావు వివరించారు. నాయకత్వ మార్పిడిపై బీఆర్ఎస్‌లో తీవ్ర చర్చ జరుగుతున్నట్టు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నది కదా.. అని విలేఖరులు ప్రశ్నించినప్పుడు ''అసలు నాయకత్వం ఎవరికి అనే పంచాయితీయే మా పార్టీలో లేదు. కేసీఆర్ మా పార్టీ అధ్యక్షుడు. ఆయన ఆదేశాలే అంతిమం. కేసీఆర్ ఆదేశాలను తూ.చ. తప్పకుండా పాటించే క్రమశిక్షణ కలిగిన కార్యకర్త హరీశ్‌రావు. ఇప్పుడే కాదు; ఇదే విషయాన్ని కొన్ని వందల సార్లు, వందల సభల్లో, ప్రెస్‌మీట్లలో, టీవీ డిస్కుషన్లలో, చిట్‌చాట్లలో చెప్పిన. అనేక సందర్భాల్లో స్పష్టంచేసిన. కేసీఆరే మా అందరి నాయకుడు. అంతేకాదు; పార్టీ నాయకత్వాన్ని కేటీఆర్‌కు అప్పగించాలని కేసీఆర్ నిర్ణయిస్తే, దాన్ని సంపూర్ణంగా స్వాగతిస్తా. కచ్చితంగా నూటికి నూరుశాతం కేటీఆర్‌కు సహకరిస్తా. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పార్టీ నిర్ణయాన్ని, కేసీఆర్ నిర్ణయాన్ని శిరసావహిస్తానే తప్ప గీత దాటే వ్యక్తిని కాదు నేను. నా 25 ఏండ్ల రాజకీయ ప్రస్థానమే దీనికి నిదర్శనం'' అని హరీశ్‌రావు ఉద్ఘాటించారు. ''నేను 25 ఏండ్లుగా బీఆర్ఎస్ పార్టీలో ఉన్నాను. పార్టీ జెండా పుట్టుక నుంచి ఈ రోజు వరకు కేసీఆర్ అడుగుజాడల్లో, ఆయన సూచనలకు అనుగుణంగా పనిచేసే ఒక కార్యకర్తగా పనిచేశాను. ఇకపైనా పనిచేస్తాను'' అని స్పష్టంచేశారు. ''మై లీడర్ ఈజ్ కేసీఆర్. వాట్ ఎవర్ కేసీఆర్ సేస్, హరీశ్‌రావు విల్ ఫాలో ఇట్. దట్సాల్ (నా నాయకుడు కేసీఆర్. కేసీఆర్ చెప్తాడు, హరీశ్ పాటిస్తాడు. అంతే, ఇందులో ఇంకోమాటే లేదు)'' అని హరీశ్ విస్పష్టంచేశారు. ప్రజలకు మంచి చేయడం ఎలాగో తెల్వనివారు, తమ మధ్య లేని పోని అపోహలు సృష్టించాలని ఎన్ని ప్రయత్నాలు చేసినా, సఫలం కారని, కాలేరని ఆయన తేల్చిచెప్పారు. పార్టీలోని ముఖ్యుల మధ్య దశాబ్దాలుగా ఉన్న అనుబంధాలను కల్పిత కథనాలతో, కుట్రపూరిత ప్రచారాలతో చెడగొట్టడం సాధ్యంకాదని.. ఇటువంటి ఎత్తుగడలకు బీఆర్ఎస్ వంటి పార్టీ లొంగిపోదని హరీశ్‌రావు స్పష్టంచేశారు.

ఫేక్ ప్రచారాన్ని నమ్మొద్దు

సోషల్ మీడియాలో సాగుతున్న దుష్ప్రచారాన్ని, తనపై వస్తున్న తప్పుడు వార్తలను నమ్మొద్దని హరీశ్‌రావు పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. తనపై వచ్చిన తప్పుడు కథనాలను తాను అదే రోజు ఖండించానని గుర్తు చేశారు. ''ఖండించడమే కాదు; తనపై సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న వారి మీద చర్యలు తీసుకోవాలని నేనే కోరాను. ఈ మేరకు పార్టీ తరపున బీఆర్ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్, ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించాను. ఫిర్యాదు పత్రాలను ఎక్స్‌లో పోస్ట్ చేశాను. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని కూడా కోరాను'' అని హరీశ్‌రావు వివరించారు.

సీఎం రేవంత్‌ది విధ్వంస పాలన

మొదటిపేజీ తరువాయి...

రౌండ్‌టేబుల్ సమావేశంలో హరగోపాల్ మాట్లాడారు. పర్యావరణానికి, ప్రజలకు నష్టం కలిగేలా కాంగ్రెస్ పాలన సాగుతున్నదని మండిపడ్డారు. కార్పొరేట్ విధానంలో పాలనను నడుపుతున్నారని, ప్రజలను కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఫార్మా సిటీ పేరుతో పర్యావరణం, ప్రకృతిని ధ్వంసం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఫార్మా పరిశ్రమలు, ఇథనాల్ పరిశ్రమలు అంత్యంత ప్రమాదకరమైనవని, వాటిని నెలకొల్పడం ద్వారా భవిష్యత్తు తరాలు కాలుష్యం కోరల్లో చిక్కుకుంటాయని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజల వ్యవసాయ భూములను లాక్కుని కార్పొరేట్ శక్తులకు కట్టబెడతామని చూస్తే ప్రజలు మరో ఉద్యమం చేస్తారని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విధ్వంస పాలనను కొనసాగిస్తే.. పౌరసమాజం తిరగబడుతుందని, ప్రజలు ప్రత్యామ్నాయానికి తెర తీస్తారని స్పష్టంచేశారు. మార్పు పేరుతో కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చి ప్రజలను మోసగించారని తెలిపారు. ప్రభుత్వం చేసే ప్రతిపనికీ ప్రజలకు, ప్రజా సంఘాలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రజాసంఘాలను సంఘటితం చేసి మరిన్ని సమావేశాలు నిర్వహిస్తామని హరగోపాల్ ప్రకటించారు.

ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలోనే ప్రజా వ్యతిరేక పనులతో, రాజకీయ తప్పిదాలతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్నదని రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న పలువురు వక్తలు విమర్శించారు. మూసీ, హైడ్రా పేరుతో ప్రణాళిక లేకుండా బుల్డోజర్లతో పేదల ఇండ్లను కూలుస్తూ నిరంకుశ పాలన సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పర్యావరణ, ప్రకృతి సంపదకు కేంద్రమైన దామగుండం అడవిని కేంద్రానికి రాసిచ్చి విధ్వంసానికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. విద్యుత్తు పంపిణీ వ్యవస్థను ప్రైవేట్‌పరంచేసేలా పాతబస్తీ విద్యుత్తు బిల్లుల వసూళ్లను అదానీ కంపెనీకి ఇస్తూ ఒప్పందం చేసుకున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ నివేదిక రాకముందే కాంట్రాక్టర్ మెగా కృష్ణారెడ్డితో సఖ్యత పెంచుకుని.. ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషిచేసిన మహిళలు, ఉద్యోగులు, ముస్లింలను అన్నివిధాలా మోసం చేశారని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని చెప్తూనే.. ఎలాంటి ఉపయోగం లేని అందాల పోటీలను నిర్వహిస్తూ, అడ్డుకున్న వారిని నిర్బంధించారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా విధ్వంసకర అభివృద్ధి నమూనాను పక్కనబెట్టి రాష్ట్ర వాస్తవ అభివృద్ధికి పాటుపడాలని హితవు పలికారు.

పేదల భూములపై సర్కార్ కన్ను

రాష్ట్ర పాలకులు అభివృద్ధి పేరుతో పేదల భూములను లాక్కొని కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని వక్తలు ఆరోపించారు. ఫార్మా విలేజ్ పేరుతో లగచర్లలో అడ్డగోలుగా భూసేకరణకు పాల్పడ్డారని మండిపడ్డారు. ప్రతిఘటించిన అమాయక గిరిజన రైతులపై పోలీసు నిర్బంధాన్ని ప్రయోగించారని ఆవేదన వ్యక్తంచేశారు. తాము అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేస్తామని నమ్మకద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫ్యూచర్ సిటీ పేరుతో వేలాది ఎకరాలను నిబంధనలకు విరుద్ధంగా లాక్కొని రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారని విమర్శించారు. పర్యావరణం, జీవావరణానికి కేంద్రమైన హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెట్టాలని చూశారని ఆరోపించారు.

కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలి

మొదటిపేజీ తరువాయి...

మంగళవారం హైదరాబాద్‌లో కేటీఆర్‌తో సమావేశం సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేస్తున్న శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎర్రబెల్లి, చిత్రంలో వినోద్‌కుమార్, సత్యవతి రాథోడ్, పొన్నాల లక్ష్మయ్య, వద్దిరాజు రవిచంద్ర, రాజయ్య, వినయ్ భాస్కర్, తక్కళ్లపల్లి రవీందర్, గండ్ర వెంకటరమణారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, సతీశ్‌రెడ్డి, వాసుదేవారెడ్డి తదితరులు

చేస్తామని స్పష్టంచేశారు. రైతు ఆత్మహరూపొందించుకోవాలని చెప్పారు. 'వాగు దాటే దాకా ఓడ మల్లన్న.. వాగు దాటినంక బోడి మల్లన్న' అన్నట్టు రేవంత్ ప్రభుత్వ పాలన ఉన్నదని విమర్శించారు. కాంగ్రెస్ అరాచకాలను ఒక్క బీఆర్ఎస్ పార్టీ మాత్రమే ఎదుర్కొంటుందని ధీమా ఇచ్చారు. ప్రజాపాలన పేరుతో అధికారంలో వచ్చి ప్రజలను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ అంతానికి వరంగల్ సభతో ఆరంభం మొదలైందని చెప్పారు. అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే ప్రజల్లో ఇంత వ్యతిరేకతను మూటగట్టుకున్న ప్రభుత్వాన్ని తాను ఇప్పటివరకు చూడలేదన్నారు. అనుభవలేమి, మోసం, అత్యాశ, అందినకాడికి దోచుకోవడం అనే లక్షణాలు పుష్కలంగా ఉన్న రేవంత్ సర్కార్‌తో తెలంగాణ అభివృద్ధి రెండు దశాబ్దాలు వెనక్కి పోయిందన్నారు.

రైతు సమస్యలపై విస్తృత పోరాటాలు

రైతు ఆత్మహత్యలు, వారి సమస్యల పరిష్కారంపై రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ విస్తృత పోరాటాలు చేస్తుందని కేటీఆర్ తెలిపారు. రైతు భరోసా చెల్లింపులు సక్రమంగా జరగకపోవడం, ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా పార్టీ కార్యచరణ ఉండబోతుందని చెప్పారు. నిరుద్యోగులకు నోటిఫికేషన్లు ఇవ్వకపోవడం, ఉద్యోగ నియామకాల్లో అవకతవకలపై సమగ్ర వ్యూహంతో ప్రజా ఉద్యమాలను ప్రారంభిస్తామని వెల్లడించారు. మోసానికి మారుపేరైన కాంగ్రెస్ నైజాన్ని ప్రజాక్షేత్రంలోనే ఎండగడుతామని స్పష్టంచేశారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలును కాంగ్రెస్ ఎలా విస్మరించిందో ప్రజలకు వివరిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసాలను, అవినీతిని ప్రజల్లో బయటపెడతామని, ప్రజలను మోసం చేస్తూ వేధిస్తుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోరాటాలకు పార్టీ సిద్ధంగా ఉన్నదని చెప్పారు.

తెలంగాణ చరిత్రలోనే అతిపెద్ద బహిరంగ సభ

తెలంగాణ చరిత్రలోనే అత్యంత భారీ సభగా ఎల్కతుర్తి మీటింగ్ నిలిచిందని కేటీఆర్ అభివర్ణించారు. ఈ విజయానికి కారణమైన ప్రతి కార్యకర్తకు, నేతకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పకడ్బందీ ప్రణాళిక, క్రమశిక్షణ, ప్రజల్లో బీఆర్ఎస్‌పై ఉన్న అంతులేని అభిమానానికి ఎల్కతుర్తి సభనే నిదర్శనమని చెప్పారు. ఎల్కతుర్తి బహిరంగ సభ తర్వాత రాష్ట్ర రాజకీయాల దిశ మారిందని తెలిపారు. 'ఇప్పుడైనా, ఎప్పుడైనా రాష్ట్ర రాజకీయాలకు కేంద్రబిందువు బీఆర్ఎస్సే. సభ తర్వాత ప్రజలు, కార్యకర్తల్లో పాజిటివ్ ఎనర్జీ వచ్చింది. కాంగ్రెస్ అరాచకాలపై అలుపెరగని పోరాటం చేసే ఉత్సాహం కలిగింది' అని తెలిపారు. ఏనాటికైనా తెలంగాణకు, తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్సే శ్రీరామరక్ష అన్న సంగతి సభతో మరోసారి నిరూపితమైందన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ నేతలు కేటీఆర్‌తో మాట్లాడారు. పార్టీ 25 సంవత్సరాల సంబురాన్ని వరంగల్ గడ్డపై నిర్వహించే అవకాశం తమకు ఇచ్చినందుకు కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. అన్ని విషయాల్లో తమకు దిశానిర్దేశం చేసిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వరంగల్ నేతలతో కలిసి కేటీఆర్ భోజనం చేశారు. కేటీఆర్ ఇచ్చిన ఆత్మీయ విందులో శాసనమండలిలో ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, పొన్నాల లక్ష్మయ్య, డీఎస్ రెడ్యా నాయక్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, వొడితల సతీశ్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, గండ్ర వెంకటరమణారెడ్డి, జడ్పీ మాజీ అధ్యక్షులు ఎం సుధీర్‌కుమార్, గండ్ర జ్యోతి, అంగోత్ బిందు, పార్టీ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, నాగుర్ల వెంకటేశ్వర్లు, కే వాసుదేవారెడ్డి, వై సతీశ్‌రెడ్డి, మెట్టు శ్రీనివాస్, ఏనుగుల రాకేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ పిల్లల ఆరోగ్యంపై లేదా?

అందాల పోటీలపై సమీక్షలతో బిజీగా ఉంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌కు పిల్లల ఆరోగ్యం గురించి పట్టించుకొనే సమయమెక్కడిదని కేటీఆర్ ఎద్దేవాచేశారు. ఫీవర్ హాస్పిటల్‌లో పిల్లల వైద్యుల్లేక చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంగళవారం ఎక్స్ వేదికగా ఆవేదన వ్యక్తంచేశారు. 'పిల్లల వైద్యులను నియమించేందుకు ప్రభుత్వానికి ఎంత సమయం పడుతుంది? పిల్లలు, వారి తల్లిదండ్రులు ఏడాదికిపైగా ఎందుకు బాధపడాలి? ఇందుకు పాలకులు కారకులు కాదా?' అని ప్రశ్నించారు. వానకాలం సమీపిస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే వైద్యుల నియామకంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

తప్పుడు వార్తల తెలంగాణ స్కైబ్‌పై ఫిర్యాదు

నాంపల్లి క్రిమినల్ కోర్టులు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అండదండలతో నిర్వహిస్తున్న డిజిటల్ పత్రిక 'తెలంగాణ స్కైబ్' బీఆర్ఎస్ పార్టీపై ప్రజల్లో చెడు అభిప్రాయాన్ని పెంచేలా తప్పుడు వార్తలను ప్రచురిస్తున్నదని ఆరోపిస్తూ బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రేయారెడ్డి సైబర్ క్రైమ్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. తప్పుడు సమాచారంతో పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించే వార్తపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రేయారెడ్డి

రెండోదఫాలో 2,500 కోట్ల అప్పు

హైదరాబాద్, మే 13 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు చేయడం కొనసాగిస్తూనే ఉన్నది. ఆర్బీఐ నుంచి తాజాగా మరో రూ.2,500 కోట్ల రుణం తీసుకున్నది. మంగళవారం నిర్వహించిన ఈ-వేలం ద్వారా సెక్యూరిటీ బాండ్లు పెట్టి ఈ రుణం సేకరించినట్టు ఆర్బీఐ ప్రకటించింది. 21 ఏండ్లకాల పరిమితికి 6.86 శాతం వార్షిక వడ్డీతో రూ.800 కోట్లు, 22 ఏండ్ల కాల పరిమితికి 6.86 శాతం వార్షిక వడ్డీతో రూ.900 కోట్లు, 25 ఏండ్ల కాలపరిమితికి 6.85 శాతం వార్షిక వడ్డీతో మరో రూ.900 కోట్లు సమీకరించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.14 వేల కోట్ల రుణ సమీకరణ కోసం ఆర్బీఐకి రేవంత్ సర్కారు ప్రతిపాదనలు పంపించింది. ఏప్రిల్‌లో మూడు దఫాల్లో రూ.4,400 కోట్లు తీసుకున్నది. రెండో నెల మే 6న రూ.2,000 కోట్లు, 13న మరో రూ.2,500 కోట్ల అప్పు తీసుకున్నది. ఈ ఆర్థిక సంవత్సరం మార్కెట్ రుణాల కింద రూ.64,539 కోట్లు సమీకరిస్తామని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. నెలన్నరలోనే ఒక్క ఆర్బీఐ నుంచే రూ.9 వేల కోట్లు తీసుకున్నారు.

కొత్త పింఛన్లకు మోక్షమెప్పుడో!

- ఏడాదిన్నర అవుతున్నా కనికరించని సర్కారు
- రాష్ట్రవ్యాప్తంగా 5.2 లక్షల మంది ఎదురుచూపు
- రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 2 లక్షల పింఛన్ల కోత

హైదరాబాద్ మే 13 (నమస్తేతెలంగాణ): అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే పింఛన్ పెంపుతో పాటు కొత్తవారికి పింఛన్లు మంజూరు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్.. ఏడాదిన్నర అవుతున్నా కనికరించడం లేదు. క్షేత్రస్థాయి పరిశీలన, అనర్హుల తొలగింపు, అర్హుల గుర్తింపు పేరిట ప్రభుత్వం తాత్సారం చేస్తున్నది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5.2 లక్షల మందికి 18 నెలలుగా ఎదురుచూపులు తప్పడంలేదు. కాంగ్రెస్ గద్దెనెక్కిన వెంటనే 2024 జనవరిలో ప్రజాపాలన పేరిట గ్రామసభలు నిర్వ హించి కొత్త పింఛన్లకు దరఖాస్తులు స్వీకరించింది. ఆ తర్వాత ఆన్‌లైన్‌లోనూ అప్లికేషన్లు తీసుకున్నారు. ఎన్నికల ముందు చెప్పినట్టు, మ్యానిఫెస్టోలో పెట్టినట్టు కొత్త ప్రభుత్వం పింఛన్లు ఇస్తుందని అందరూ భావించారు. సుమారు 25 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. అర్జీలను పరిశీలించిన అధికారులు వీరిలో దాదాపు 5.2 లక్షల మందిని అర్హులుగా తేల్చారు. కానీ వీరికి పింఛన్లు మాత్రం మంజూరు చేయడంలేదు.

వడపోత మొదలు పెట్టి..

20 రోజుల క్రితం దరఖాస్తుల దుమ్ము దులిపిన ప్రభుత్వం కొత్తవారికి ఆసరా పింఛన్లు ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నట్టు చెప్పింది. ఇందులో భాగంగా అర్హుల జాబితాను రూపొందించాలని సెర్ప్ యంత్రాంగాన్ని ఆదేశించింది. సర్కారు ఆదేశాలతో కదిలిన సెర్ప్ అధికారులు సమీక్షించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్లను ఆదేశించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణాలు, నగరాల్లో బిల్ కలెక్టర్ల ద్వారా సర్వే చేయించి అర్హులను గుర్తించాలని సూచించారు. వృద్ధాప్య పింఛన్ పొందుతూ మరణించిన వారి జాబితాల ఆధారంగా పరిశీలించి భార్య/భర్తలు అర్హులైతే వారి వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే వరుసగా మూడు నెలలు పింఛన్ తీసుకోనివారిని వలసవెళ్లినట్టుగా గుర్తించి తొలగించాలని సూచించారు.

సుమారు 2 లక్షల మందికి కోత

కొత్త పింఛన్ల మంజూరుపై నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం లబ్ధిదారుల్లో కోత పెడుతున్నది. ఒకే ఇంటిలో ఇద్దరు పింఛన్లు తీసుకుంటున్నారనే కారణంతో 2024 జూలైలో సుమారు 1,826 మందికి రికవరీ నోటీసులు జారీ చేసింది. అలాగే మరణించిన, వలస వెళ్లారనే ఇతరత్రా కారణాలతో దాదాపు 1.4 లక్షల మంది లబ్ధిదారులను పింఛన్ల జాబితా నుంచి తొలగించింది. కేసీఆర్ పాలనలో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్, బోధకాలు బాధితులు, బీడీకార్మికులు, టేకేదార్లు, దివ్యాంగులకు మొత్తం 44.7 లక్షల మందికి పింఛన్లు ఇస్తుండేది. దివ్యాంగులకు రూ. 4,016, ఇతరులకు రూ. 2,016 చొప్పున అందజేసేది. ఇందుకు ప్రతినెలా రూ. 900 కోట్లకు పైగా వెచ్చించేది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వివిధ కారణాలతో సుమారు 2 లక్షల మంది లబ్ధిదారుల పింఛన్లను రద్దుచేసింది. ప్రస్తుతం దాదాపు 42.7 లక్షల మందికే ఆసరా పథకాన్ని వర్తింపజేస్తున్నారు. దీంతో సర్కారుపై ప్రతినెలా సుమారు రూ. 150 కోట్ల భారం తగ్గింది.

వచ్చే నెల నుంచైనా అమలయ్యేనా?

మే నుంచే కొత్త పింఛన్లు ఇస్తామని హడావుడి చేసిన సర్కారు ఆచరణలో విఫలమైంది. పాతవారికి మాత్రమే మంజూరు చేసి కొత్తవారికి మొండి చెయ్యి చూపింది. దీంతో సుమారు 5.2 లక్షల మంది లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. పదేపదే ఆధార్ కార్డులు, బ్యాంకు బుక్కులు ఇవ్వాలని అడుగుతున్నారే తప్ప పింఛన్ మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకులు, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి తిరిగి వేసారిపోతున్నామని వాపోతున్నారు. కనీసం వచ్చే నెల నుంచైనా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

బీడీ కార్మికులపై చిన్నచూపు..

పీఎఫ్ కటాప్ తేదీని 2018కి పెంచి అర్హులైన బీడీ కార్మికులకు పింఛన్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఈ దిశగా కనీస చర్యలు చేపట్టలేదు. దరఖాస్తులు తీసుకొని చేతులు దులుపుకున్నదే తప్పితే చేసిందేమీలేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 వేల మంది పింఛన్ మంజూరు కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు పీఎఫ్ కటాప్ తేదీని 2018గా పరిగణించి అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలని కోరుతున్నారు.

జూన్ 12న రాష్ట్రానికి నైరుతి

- అండమాన్ తీరానికి నైరుతి రుతుపవనాలు
- ఈనెల 27న కేరళ తీరాన్ని తాకే అవకాశం
- వాతావరణ శాఖ వెల్లడి

హైదరాబాద్, మే 13 (నమస్తేతెలంగాణ): దేశ ప్రజలకు భారత వాతావరణ శాఖ చల్లని కబురు పంపింది. దేశానికి అత్యధిక వర్షపాతాన్నిచ్చే నైరుతి రుతుపవనాలు మంగళవారం మధ్యాహ్నం నాటికే దక్షిణ అండమాన్ సముద్రం, నికోబార్ దీవులు, దక్షిణ బంగాళాఖాతాన్ని తాకినట్టు శాఖ వెల్లడించింది. బుధవారం ఆగ్నేయ బంగాళాఖాతంలో ఆవర్తనం ఏర్పడే అవకాశాలున్నట్టు ఆ శాఖ అధికారులు తెలిపారు. రుతుపవనాల ఆగమనంతో గత రెండు రోజులుగా నికోబార్ దీవుల్లో భారీ వర్షాలు పడుతున్నాయని పేర్కొన్నది. రానున్న మూడు, నాలుగు రోజుల్లో అండమాన్ నుంచి దక్షిణ అరేబియా సముద్రం, బంగాళాఖాతం మధ్య వరకు విస్తరించడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపింది. మరింత చురుగ్గా ముందుకు కదులుతున్న రుతుపవనాలు మే 27 నాటికి కేరళను తాకుతాయని తెలిపింది. జూన్ 12న తెలంగాణకు నైరుతి రుతుపవనాలు తాకనున్నాయి. రాష్ట్రంలో ఈసారి సాధారణం కంటే అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నది. రుతుపవనాల రాకతో రాష్ట్రంలో మరో వారం రోజుల్లో అధిక ఉష్ణోగ్రతల ప్రభావం ముగియనున్నదని వాతావరణ శాఖ వెల్లడించింది.

రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతలు..

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	42	28.2
భద్రాచలం	40.8	28.2
హనుమకొండ	40.5	27
హైదరాబాద్	38	25.4
ఖమ్మం	42.4	29
మహబూబ్‌నగర్	38.5	24.3
మెదక్	39.2	23.5
నల్లగొండ	40	25
నిజామాబాద్	39.9	26.9
రామగుండం	41.8	28.4

రాష్ట్రంలో పలుచోట్ల భారీ వర్షాలు

రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో మంగళవారం భారీ వర్షాలు కురిసినట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. సిద్దిపేట, జనగామ, ఆదిలాబాద్, కొత్తగూడెం, ఆసిఫాబాద్, నిర్మల్, మహబూబాబాద్, భువనగిరి, కరీంనగర్, హనుమకొండ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసినట్టు వెల్లడించింది. వివిధ చోట్ల పిడుగులు పడినట్టు పేర్కొన్నది.

క్యూఆర్ కోడ్‌తో నకిలీ ఔషధాలకు చెక్

300 ఔషధాల బ్రాండ్లకు క్యూఆర్ కోడ్ తప్పనిసరి చేసిన డీసీఏ

అనుమానాలుంటే టోల్‌ఫ్రీ నంబర్ 1800 599 6969 కు కాల్ చేయండి



హైదరాబాద్ సిటీబ్యూరో, మే 13, (నమస్తే తెలంగాణ): విచ్చలవిడిగా లభించే నకిలీ మందుల కట్టడికి తెలంగాణ రాష్ట్ర ఔషధ నియంత్రణ శాఖ (టీఎస్‌డీసీఏ) చర్యలు చేపట్టింది. బయట లభించే ఔషధాల్లో నకలీలను తెలుసుకునేందుకు క్యూఆర్ కోడ్‌ను ప్రవేశపెట్టింది. ఔషధాల ప్యాకింగ్‌పై ముద్రించే క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి వాటి నాణ్యతను చూసుకునేందుకు ఈ చర్యలు చేపట్టింది. ప్రస్తుతం కేంద్ర ఆరోగ్యశాఖ ఉత్తర్వుల ప్రకారం 300 ప్రముఖ ఔషధ బ్రాండ్లకు ఈ క్యూఆర్ కోడ్ తప్పనిసరిగా ఉండాలి. ఈ మందులు 2023 ఆగస్టు 1 తరువాత తయారైనవి కావాలి.

స్కాన్ చేసి నిర్ధారించుకోండి..

*కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జారీచేసిన ఉత్తర్వుల మేరకు, 2023 ఆగస్టు 1వ తేదీ నుంచి, ప్రముఖ ఔషధాలపై క్యూఆర్ కోడ్‌ను ముద్రించడం తప్పనిసరి. కేంద్ర ఔషధ నిబంధనల నియంత్రణ సంస్థ దీన్ని అమలు చేయనుంది. దీని ద్వారా ప్రజలు తాము కొనుగోలు చేస్తున్న మందులు నకిల